దివ్యాంగుల రిజర్వేషన్లు 4 శాతానికి పెంచిన కేంద్రం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జి.కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రిజర్వేషన్లను మోదీ ప్రభుత్వం 3 నుంచి 4 శాతానికి పెంచిందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అనేక సంక్షేమ పథకాలను ప్రకటించిందన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని నివాసంలో అఖిలభారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కేంద్ర సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శబరిమలలో భక్తుల సమస్యలపై సీఎంకి వినతి



శబరిమలలో సమస్యలపై సీఎంకి వినతి పత్రం ఇస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

నల్లకుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం నుంచి కేరళలోని శబరిమలకు పెద్దఎత్తున తరలివెళ్తున్న అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఐక్యవేదిక ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. శబరిమలలో అయ్యప్ప భక్తుల రద్దీ నేపథ్యంలో అక్కడ ఆలయంలో అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పరిష్కరించేలా ఆ రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ కమిటీతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణ ఐక్యవేదిక ప్రతినిధులు అచ్చిరెడ్డి బుచ్చిరెడ్డి, బాలకృష్ణ, రాధాకృష్ణ, గాంధీ గురుస్వాములు పాల్గొన్నారు.



గౌతమ్‌రావును సత్కరిస్తున్న ఏ.సూర్యప్రకాష్‌సింగ్

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

బర్కత్‌పుర, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ ఎంపీ నియోజకవర్గం నుంచి బీజేపీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన కోరారు. మంగళవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా డాక్టర్ ఎన్.గౌతమ్ రావును బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను ప్రతీ కార్యకర్త సవాల్‌గా తీసుకుని పని చేయాలని కోరారు.



అక్షింతల ఊరేగింపులో కార్పొరేటర్ వినయ్‌కుమార్, తదితరులు

ప్రజలకు అయోధ్య అక్షింతలు పంపిణీ

చిక్కడపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరంలో ప్రాణప్రతిష్ఠ పూజిత అక్షింతల ఊరేగింపులో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పాల్గొన్నారు. మంగళవారం బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, సంఘ్ పరివార్, ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలతో కలిసి కార్పొరేటర్ ఇంటింటికీ అక్షింతలను అందజేశారు. మొదట ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పవిత్రమైన శ్రీరాముని అక్షింతల ఊరేగింపును ప్రారంభించారు.

సేవాభావంతో పని చేస్తే గుర్తింపు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రుక్మిణి, వేణుగోపాల్, ఆంజనేయులు

కవాడగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సేవా భావంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని సామాజిక సమరసత వేదిక మహిళా రాష్ట్ర కన్వీనర్ రుక్మిణి, కో-కన్వీనర్ వేణుగోపాల్, ఆర్యసమాజ్ కవాడిగూడ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ అక్షరాల నిజం చేయాలని వారు సూచించారు. నూతన సంవత్సరం 2024 మంగళవారం సామాజిక సమరసత సికింద్రాబాద్ కన్వీనర్ సిటి బలరాంయాదవ్ ఆధ్వర్యంలో కవాడిగూడ ఆర్యసమాజ్ భవవన్‌లో 50 మంది మహిళలు. 20 మంది పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. రఘుపతి, సామాజిక సమరసత కవాడిగూడ సంయోజక్ విశ్వేశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.



ముషీరాబాద్ ఆసుపత్రిలో స్వెటర్లు పంపిణీ చేస్తున్న షాహెద్ తదితరులు

స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ముషీరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాలలో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని హిదాయత్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ షాహెద్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని భోలక్‌పూర్, ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి షాహెద్ స్వెటర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వైద్య అధికారులు డాక్టర్ దీప్తి, డాక్టర్ మెహరూన్ ఇమ్రాన్, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ డి.వెంకట్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ పోటీ

రాంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డి.వెంకట్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన బీఎల్ఎఫ్ ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు ప్రత్యామ్నాయంగా పోరాటాలు చేస్తోందన్నారు. సమావేశంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు వనం సుధాకర్, వెంకటస్వామి, మత్తయ్య, గోపాల్, కాశీం, లింగస్వామి పాల్గొన్నారు.

రైలు ఎక్కబోతూ జారిపడి వృద్ధుడి మృతి

బర్కత్ పుర జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైలు ఎక్కబోతు ప్రమాదవశాత్తు జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అవంతినగర్‌కు చెందిన వై గోవిందు(73) కూలి. గుంతకల్ వెళ్లడానికి మంగళవారం రాత్రి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు కాచిగూడ- యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్లాట్‌ఫారంపైకి వస్తుండగా గోవింద్ నడుస్తున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మణచారి తెలిపారు.

పట్టాలు దాటుతుండగా..

బర్కత్‌పుర: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం బుద్వేల్-ఫలక్‌నామా రైల్వేస్టేషన్ల నడుమ 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్‌కు బారులు.. ఆగిన దారులు


- పలు చోట్ల నో స్టాక్ బోర్డు
- కిలోమీటర్ల మేర వాహనదారులు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గంలో పెట్రోల్ కోసం బంకుల వద్ద వాహనదారులు కిలోమీటర్ల మేర గంటల కొద్దీ పడిగాపులుకాశారు. పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు ఒక్కసారిగా సారిగా ఎగబడడంతో బంకు యజమానులు నో స్టాక్ బోర్డులు పెట్టారు. అయినా వాహనదారులు కదలకపోవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది.



కవాడిగూడ కొత్తబజార్ పెట్రోల్ బంక్‌వద్ద బారులుతీరిన వాహనదారులు

కవాడిగూడ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో పెట్రోల్‌కోసం వాహనదారులు బంకుల్లో బారులు తీరారు. దీంతో లోయర్ ట్యాంక్ బండ్, కవాడిగూడ, ముషీరాబాద్, చిక్కడపల్లి, విద్యానగర్, ఛే నెంబర్, బర్కత్‌పుర, నారాయణగూడ, హిమాయత్ నగర్, లిబర్టీ పెట్రోల్‌బంకులు వాహనదారులతో కిటకిటలాడాయి. వాహనదారులు భారీగా తరలిరావడంతో పెట్రోల్ బంక్‌ల వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రతి పెట్రోల్ బంక్ వద్ద కిలోమీటరు పొడవుగా క్యూలైన్ ఉండటంతో ఆయా పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు కొన్ని బంకుల్లో గొడవలూ జరిగాయి. పలు బంకుల్లో నో స్టాక్ బోర్డు పెట్టడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒకేసారి వందలాది వాహనాలు రావడంతో వారిని కంట్రోల్‌చేయడం పెట్రోల్‌బంక్‌ల సిబ్బందికి తలనొప్పిగా మారింది. కొన్నిచోట్ల ట్రాఫిక్ పోలీసులకు కూడా ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అయితే ట్రక్ డ్రైవర్లు సమ్మెను విరమించారని తెలుసుకున్నవాహనాదారులు వెనుతిరిగి వెళ్లిపోయారు.



ముషీరాబాద్‌లో నోస్టాక్ బోర్డు పెట్టిన బంక్ యజమానులు

ఇబ్బంది పడ్డ వాహనదారులు

ముషీరాబాద్: పెట్రోలు బంక్‌లు మూసీ ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పెట్రోలు బంక్‌లలో పెట్రోలు కొరత ఏర్పడి నో స్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో వాహనదారులు పెట్రోలు బంక్‌ల ముందు భారీ ఎత్తున క్యూలో నిల్చున్నారు. గొడవలు జరగకుండా పెట్రోలు బంక్‌ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలు కోసం వాహనదారులు పెద్దపెద్ద క్యాన్లు తెచ్చి లైన్లో నిలబడ్డారు.

7న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



నల్లకుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులు.. పవర్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలు ఈనెల 7న ముషీరాబాద్ మెయిన్ రోడ్డు మెట్రోస్టేషన్ సమీపంలో గల ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. చిక్కడపల్లి జోన్ పరిధిలోని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాలకు చెందిన ఆసక్తి గల మహిళలు ఈ పోటీలో పాల్గొనవచ్చు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతికి రూ.3 వేలు ప్రదానం చేయనున్నారు. ఈ పోటీలో చుక్కల ముగ్గులు మాత్రమే వేయాల్సి ఉంటుంది. ముగ్గుల రంగులు మహిళలు వెంట తెచ్చుకోవాలి. ఈ పోటీలకు ఆసక్తి గల వారు 93930 04039, 99854 11018లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు తెలిపారు.

'అంబర్‌పేట'లో 49,904 దరఖాస్తులు



కవాడిగూడ తాళ్లబస్తీ సెంటర్‌లో కేంద్రాన్ని పరిశీలిస్తున్న మహేందర్‌బాబు, వెంకటేష్ తదితరులు

బర్కత్‌పుర/నల్లకుంట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిపాలనలో భాగంగా ఐదు గ్యారంటీల పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి లబ్ధిదారులు పోటెత్తుతున్నారు. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో 20 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. రెండు రోజులు వరుసగా సెలవు దినాలు రావడంతో మంగళవారం సెంటర్ల వద్ద ప్రజలు బారులుతీరారు. నియోజకవర్గంలోని 20 సెంటర్లలో 12,454 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అభయహస్తం కింద 9,519, ఇతర సమస్యలపై 2,935 దరఖాస్తులు వచ్చాయని డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. ఇప్పటి వరకు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి 49,904 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో అభయహస్తం కింద 40,666 మంది దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కమ్యూనిటీహాల్‌లోని సెంటర్‌ను బీజేపీ సీనియర్ నాయకుడు కృష్ణాయాదవ్ పరిశీలించారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

చిక్కడపల్లి: ఐదు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలనలో అర్హులైన ప్రజలందరూ దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ వీవీగిరినగర్‌లో యువజన కాంగ్రెస్ నాయకుడు సాయికీర్త్(బాబీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం ప్రారంభించారు.



కార్యాలయాన్ని ప్రారంభించిన అనిల్‌కుమార్‌యాదవ్

- ఐదు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఏఐసీసీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి అన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ అర్హులైనవారందరూ ఐదు గ్యారెంటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
- **కవాడిగూడ:** ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు గ్యారెంటీల పథకం దరఖాస్తులు అన్ని సెంటర్లలో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్‌బాబు అధికారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్, తాళ్లబస్తీ కమ్యూనిటీహాలు సెంటర్ ఇన్‌చార్జి గణేష్‌కుమార్, అధికారి మధు పాల్గొన్నారు.

ఆన్‌లైన్, ఓడీఎల్ పద్ధతిలో ప్రోగ్రామ్‌లు అందించాలి

వీసీ ప్రొ. కే సీతారామారావు



డా.బీ.ఆర్ అంబేద్కర్ వర్సిటీ 2024 డైరీని ఆవిష్కరించిన వీసీ ప్రొ.కే.సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.ఘంటా చక్రపాణి

హైదరాబాద్ సిటీ, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్, ఓడీఎల్ పద్ధతిలో విద్యార్థులకు ప్రోగ్రామ్‌లు అందించేందుకు ఉద్యోగులు కృషిచేయాలని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.కే.సీతారామారావు అన్నారు. అంబేడ్కర్ వర్సిటీ 2024 డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నాణ్యమైన విద్య కోసం యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని ఉద్యోగులను ఆదేశించారు. ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొ.ఏవీ.ఆర్.ఎన్.రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి సేవలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల విభాగాల అధిపతులు, డీన్లు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్‌ను పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌యాదవ్, పరుశురాం, శ్రీశైలం తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సన్మానించారు.

\- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి



వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలారెడ్డిని మంగళవారం ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్, వైఎస్‌టీపీ నేతలు కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా అభినందనలు తెలిపారు.

\- కవాడిగూడ, ఆంధ్రజ్యోతి

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి : మంత్రి సీతక్క



మంత్రి సీతక్కను సత్కరిస్తున్న నిర్వాహకులు

రవీంద్రభారతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్య అవసరాన్ని గుర్తించి మహిళా లోకానికి విద్యనందించిన గొప్ప ఆదర్శవంతురాలు సావిత్రిబాయి పూలే అని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193 జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తనలాంటి ఎంతోమందికి సావిత్రిబాయి పూలే స్ఫూర్తిప్రదాత అని అన్నారు. సావిత్రి బాయి పేరిట అవార్డులు అందజేయడం సంతోషకరమని అన్నారు. నేటి యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, ఆరేపల్లి రాజేందర్, మేకల కీర్తి, సంస్థ అధ్యక్షురాలు మాధవి అవార్డు గ్రహీతల్ని సత్కరించారు.



అంబర్‌పేట విశ్వకర్మ సంఘం గౌరవ అధ్యక్షుడు నాగారం భాస్కరాచారి, అధ్యక్షుడు పులిమామిడి శ్రీహరిచారిల ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను అంబర్‌పేట నరేంద్రనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్, విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి రాళ్లబండి నరేష్, కోశాధికారి రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

\- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

మల్లన్న కల్యాణం సంప్రదాయం ప్రకారం జరిపించాలి

ఓయూ విద్యార్థి నాయకుడు కురుమ శ్రీశైలం



మాట్లాడుతున్న కురుమ శ్రీశైలం

పంజాగుట్ట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కొమురవెల్లి గ్రామంలో వెలసిన గొల్ల కురుమల ఆరాధ్య దైవం కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణాన్ని గొల్ల కురుమల బండారు (పసుపు) సంప్రదాయం ప్రకారం జరిపించాలని తెలంగాణ గొల్ల కురుమ సంఘం, ఓయూ విద్యార్థి నాయకుడు కురుమ శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఓయూ జేఏసీ నాయకుడు ఎం.చంద్రశేఖర్ యాదవ్, సంతోష్‌యాదవ్, ప్రసాద్‌యాదవ్‌తో కలిసి మాట్లాడారు. తమ తాత, ముత్తాతల కాలం నుంచి బండారు (పసుపు) సంప్రదాయం ప్రకారం మల్లన్న కల్యాణాన్ని నిర్వహించే వారన్నారు. గడచిన 30 సంవత్సరాలుగా ఆగమశాస్త్రమని చెప్పి విభూతితో పూజలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. ఆలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

సుందరయ్య పార్కును మరింత అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ముఠా గోపాల్



పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

రాంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సుందరయ్య పార్కును వాకర్స్‌కు అనుగుణంగా దాదాపు కోటి రూపాయలతో అభివృద్ధి చేశామని, మరిన్ని సౌకర్యాలు అందించేందుకు తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. మంగళవారం సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడిగా రూపుల వివేక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామిగౌడ్, కోశాధికారిగా సిరిగిరి కిరణ్, ఉపాధ్యక్షులుగా పి రాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, గౌరవ అతిథులుగా రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠాజైసింహ, సీనియర్ నాయకులు వెంకటకృష్ణ, క్లబ్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు సునీల్‌కుమార్, సంతోష్‌గౌడ్, వి.నాగభూషణం, ఎస్ఎస్‌కె ప్రసాద్, లింగ ప్రకాష్, దామోదర్‌రెడ్డి రాజేంద్రప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడు అతినగరం సుధేష్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ రాపోలు ఆనంద్‌భాస్కర్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మార్త రమేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంతెన దశరథ్, అంకం చంద్రమౌళి, బైరి మనోహర్, సోమసతీష్, వి.తిరుపతి, గణేష్, శ్రీధర్, ఊర్మిళ, దీప, నారాయణమూర్తి, కె.వెంకటేష్, గౌరీశం, బి.సతీష్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నేతలు ముందుండాలి**

ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ నాయకులు ముందుండాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి డివిజన్‌లో చేపడుతున్న కార్యక్రమాలు రాబోయే పార్లమెంటు ఎన్నికలపై మాట్లాడారు.

- **ఘనంగా పడిపూజ**

కవాడిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ స్వామి ఆధ్వర్యంలో దోమలగూడ గగన్‌మహల్‌లో ఆయన నివాసం వద్ద జరిగిన అయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ మహాపడిపూజకు ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలుడు మిస్సింగ్

24 గంటల్లో తల్లిదండ్రులకు అప్పగింత

రాంనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌కు వెళ్లి తప్పిపోయిన బాలుడిని ముషీరాబాద్ పోలీసులు 24 గంటల్లో పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనకు సంబంధించి ముషీరాబాద్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భోలక్‌పూర్‌లో ఉంటున్న షేక్‌అన్వర్ కుమారుడు మున్వర్(12) అంజుమన్‌లోని మదర్సా స్కూల్‌లో అరబ్బీ చదువుతున్నాడు. డిసెంబర్ 30న స్కూల్‌కు వెళ్లిన మున్వర్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జనవరి 1న తండ్రి షేక్‌అన్వర్ ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముషీరాబాద్ పోలీసులు తప్పిపోయిన బాలుడిని పట్టుకునేందుకు మూడు టీంలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా బాలుడి కదలికలను బట్టి వెతకగా మంగళవారం ఉదయం ట్యాంక్‌బండ్ వద్ద కనిపించాడు. దీంతో పోలీసులు ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించడంతో సంతోషం వ్యక్తం చేశారు. సీఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలుడిని పట్టుకున్న టీం సభ్యులను సీఐ అభినందించారు.

- **క్యాలెండర్ ఆవిష్కరణ**



దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను మంగళవారం తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జనరల్ వి.సుదర్శన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్, మైనారిటీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్‌వాహీద్ అలీఖాన్, హైకోర్టు న్యాయవాదులు నవీన్‌దాస్, విజయ్ పాల్గొన్నారు.

\- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్‌గౌడ్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కె.కిరణ్‌కుమార్, బాగ్‌అంబర్‌పేట డివిజన్ టీడీపీ అధ్యక్షుడు భాను ప్రకాష్ తదితరులు కలిశారు.

\- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | అంజిరెడ్డి : 99859 21362